సాక్షి
ఖమ్మం
ఆదివారం । 1 । జనవరి । 2023


ఖమ్మంలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు


యువతుల నృత్యం

కొత్తగా.. ఘనంగా

చరిత్రలో కలిసిపోయిన సంవత్సరంలో ఎదురైన అనుభవాలను జ్ఞాపకాలుగా మలుచుకుంటూ.. ఈ కొత్త సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించే దిశగా జిల్లా వాసులు కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి ఊరూవాడ తేడా లేకుండా కేక్ కట్ చేయడంతో పాటు నృత్యాలు, కేరింతలతో సంబరంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు.

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి గడ్కరీని కలిసిన ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ సమస్యలపై బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ 365–బీ.జీ. రహదారిపై రెండుచోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటుతోపాటు మార్గంలోని పట్టణాల పరిధిలో అంతర్గత రోడ్ల విస్తరణ ఆవశ్యకతను వివరించగా కేంద్ర మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ఎంపీ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ అంశంపై పలుసార్లు కేంద్రమంత్రిని కలవడంతోపాటు లేఖలు అందజేసినట్లు ఎంపీ చెప్పారు. ఈమేరకు ఖమ్మం – అశ్వారావుపేట జాతీయ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అంతర్భాగంగా నిర్మిస్తున్న ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రజలకు మరింత చేరువగా..

- 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమానికి నేడు శ్రీకారం
- సమస్యల పరిష్కారానికి రూ.32 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక
- నలువైపులా కొత్త ఖమ్మాన్ని ఆవిష్కరించాం
- రాష్ట్రంలోనే అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది..
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'గత నాలుగేళ్లలో కొత్త ఖమ్మంను ఆవిష్కరించాం. రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థలను మెరుగుపరిచాం. మూడేళ్లలో ఖమ్మం నగరంలోనే 2వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాం. యువత క్రీడలవైపు మొగ్గు చూపేలా కావాల్సిన సౌకర్యాలు కల్పించాం, ఆహ్లాదంగా గడిపేందుకు పార్కులను నిర్మించాం. రఘునాథపాలెం మండలంలోనే రూ.253 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇక్కడ జరిగిన అభివృద్ధిని ప్రజలతోపాటు రాజకీయ నాయకులు, ఇతర ప్రాంతాల్లోని నేతలు గుర్తించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మిగిలిన పనులు పూర్తి చేసేలా ముందుకెళ్తాం. ప్రజలకు మరింత చేరువవుతూ, ఇంకా ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు వారి ఇళ్ల లోగిళ్లకు వెళ్లేందుకు ఖమ్మం నగరంలో వాడవాడకు పువ్వాడ.. పేరిట కార్యక్రమం మొదలుపెడుతున్నాం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం మంత్రి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

'వాడవాడకు పువ్వాడ'తో ప్రజల్లోకి..

ప్రజల సమస్యలు ఇంకా ఏమున్నాయో తెలుసుకునేందుకు 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమాన్ని ఖమ్మం నగరంలో తలపెట్టాం. ఆదివారం 17వ డివిజన్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. నేను ఖమ్మంలో ఉన్న సమయంలో ఉదయం 6.30నుంచి 8.30 గంటల వరకు డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ. నా వెంట మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఉంటారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తాం. వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు కూడా ప్రాధాన్యతనిస్తా. ఈ కార్యక్రమం కోసం ఎల్ఆర్ఎస్ నిధులు రూ.20 కోట్లు, సుడా నిధులు రూ.12 కోట్లు వెచ్చించడానికి ప్రభుత్వ అనుమతి కోరా. అంతేకాకుండా మున్సిపల్ జనరల్ నిధులను కూడా ఈ కార్యక్రమంలో వెల్లడయ్యే సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తాం. గతంలో సైకిల్, ద్విచక్ర వాహనాలపై ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించా. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత నిచ్చాం.

రూపురేఖలు మార్చాం..

గత నాలుగేళ్లుగా కొత్త ఖమ్మంను ఆవిష్కరించాం. కొత్త బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, కొత్త కలెక్టరేట్లను 2022లో నిర్మించుకున్నాం. మౌలిక వసతులను మెరుగుపర్చడమే కాక, ఇల్లెందు, బోనకల్, కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారులే కాక అంతర్గత రోడ్లను వెడల్పు చేశాం. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో 140 రోడ్లు నిర్మించాం. ఈ ఏడాది తీసుకున్న మున్సిపల్ నిధులతో 42 కిలోమీటర్ల కొత్త డ్రెయిన్లు నిర్మాణం చేశాం. గోళ్లపాడు చానల్ పూర్తి చేసి ఆరు పార్కులు ఏర్పాటు చేశాం. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కూడా పూర్తయింది. అలాగే గడిచిన మూడేళ్లలో రెండు వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పేదలకు న్యాయం జరిగేలా రెండు వేల మందికి పైగా వారి స్థలాలను రెగ్యులరైజ్ చేసి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చాం.

సంక్షేమానికి రూ.90 కోట్లు..

ఖమ్మం నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి ద్వారా రూ.75 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.15 కోట్లు కలిపి మొత్తం రూ.90 కోట్లు ఖర్చు చేశాం. అలాగే, 30 వేల పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం. సర్దార్ పటేల్ స్టేడియంలో టెన్నిస్‌కోర్టు, స్కేటింగ్ రింక్ ఏర్పాటు ద్వారా యువతకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాం. లకారం ట్యాంక్‌బండ్‌లో కేబుల్ బ్రిడ్జితోపాటు మ్యూజికల్ ఫౌంటెన్, ప్రజల ఆరోగ్యం కోసం పార్కులు, ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేశాం. ఇలా ఖమ్మంలో ఊహించని స్థాయిలో జరిగిన అభివృద్ధిని చూసి అంతా మంత్రముగ్ధులవుతున్నారు. ఖమ్మంను ఆదర్శంగా తీసుకోవాలని, ఖమ్మంను చూడాలని పలు జిల్లాల అధికారులు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు. ఇదేకాక మెడికల్ కాలేజీని సాధించుకోగా అడ్మిషన్లు కూడా జరగనున్నాయి. ఇక మన ఊరు – మన బడి కింద నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 80శాతం మేర పనులు పూర్తయ్యాయి.





నేడు రామయ్య జలవిహారం

- ఆగమ పద్ధతిలో సీతారాములకు పూజలు, సాయంత్రం తెప్పోత్సవం
- ఇతర ఆలయాలకూ చేరిన భద్రాద్రి సంస్కృతి


రామయ్య జలవిహారానికి సిద్ధమైన హంస వాహనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరాముడికి భద్రగిరిపై అత్యంత వైభవంగా జరిగే వేడుకల్లో నవమి కల్యాణం, ముక్కోటి అధ్యయనోత్సవాలు ముఖ్యమైనవి. ఈ రెండు సందర్భాల్లో సీతారాములను కనులారా దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ముక్కోటి సందర్భంగా ఆదివారం నిర్వహించే తెప్పోత్సవం వేడుక విశేషాలు తెలుసుకుందాం..

21 రోజుల వేడుకలు

సూర్యుడు ధనురాశిలోకి ప్రవేశించాక 11వ రోజు(ఏకాదశి)ను మధ్యగా చేసుకుని అటూఇటు 21 రోజులు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. వైష్ణవంలోని ఆగమశాస్త్ర పద్ధతులను పాటిస్తూ ఏకాదశికి ముందు జరిగే ఉత్సవాలను పగల్‌పత్తు, తర్వాత జరిగే వాటిని రాపత్తు ఉత్సవాలుగా పిలుస్తారు. పగల్‌పత్తు ఉత్సవాల్లో పదోరోజు నిర్వహించే స్వామి జల విహారాన్ని ఆగమ శాస్త్రంలో ప్లవోత్సవంగా, పరిభాషలో తెప్పోత్సవం అంటారు.

51 ఏళ్లుగా తెప్పోత్సవం..

తెప్పోత్సవాల్లో పడవ స్థానంలో హంసవాహనంలో 51 ఏళ్లుగా స్వామివారి జలవిహారం సాగుతోంది. 1971లో అప్పటి పాలకమండలి చైర్మన్ మూర్తిరాజు ఈ హంస వాహనానికి శ్రీకారం చుట్టారు. హంసాకృతి పడవలో భద్రాద్రి రామయ్య చేసే జలవిహారం కనుల పండువగా ఉండడంతో ఇతర ప్రముఖ ఆలయాలు సైతం ఉత్సాహం చూపాయి. తొలుత విజయవాడ కనకదుర్గమ్మ తెప్పోత్సవం కోసం భద్రాద్రి నుంచే హంసాకృతి పడవను తీసుకెళ్లేవారు. ఆ తర్వాత సింహాచలం, అన్నవరం ఆలయాల్లోనూ మొదలైంది.





క్లుప్తంగా

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని స్వామివారి పాదానికి వేదమంత్రాల నడుమ పంచామృతంతో అభిషేకం చేశారు. తర్వాత స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన అర్చకులు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరేలా తీర్చిదిద్దాలి


నారాయణపురం పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

ఎర్రుపాలెం: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా మెరుగైన బోధన అందిస్తూ తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలను శనివారం తనిఖీ చేసిన ఆయన ఉపాధ్యాయుల హాజరు పట్టిక, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణించేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన జెడ్పీ చైర్మన్.. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఎంపీపీ దేవరకొండ శిరీష, మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజీవినిలా పనిచేసిన స్వచ్ఛంద సంస్థలు


చిన్నారులకు మందులు అందిస్తున్న కోఆర్డినేటర్ గోపి

ఖమ్మంవైద్యవిభాగం: స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న కార్యక్రమాలు గొప్పవని, కరోనా సమయాన సంస్థల బాధ్యులు ఎందరికో అండగా నిలిచారని ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గోపి పేర్కొన్నారు. ఖమ్మం రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డే కేర్ సెంటర్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన శనివారం చిన్నారులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం నూతన సంవత్సరం కేక్ కట్ చేయగా డాక్టర్ గోపి మాట్లాడారు. ఖమ్మం కేంద్రంగా సంకల్ప సంస్థ ద్వారా వందలాది మంది చిన్నారులకు ఉచిత సేవలు అందించడం అభినందనీయమన్నారు. వైద్యులు డి.నారాయణమూర్తి, భార్గవ్, ఆరోగ్యశ్రీ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు అప్పారావు, ప్రొద్దుటూరి రవిచందర్, పావని, పి.ఉదయ్‌భాస్కర్, అనిత, వంశీ కిరీటి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న పీపీఎల్


బ్యాటింగ్ చేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: పువ్వాడ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌కేర్ హాస్పిటల్ – ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్లు తలపడ్డాయి. ప్రకాష్ ప్రాజెక్ట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 233 పరుగులు చేయగా, మ్యాక్స్‌కేర్ జట్టు 14 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌట్ కావడంతో ఓటమి పాలైంది. కార్యక్రమంలో పగడాల నాగరాజు, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎండీ మసూద్‌పాషా పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్–12లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ భార్య కానరాకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం పనిపై బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో, ఆమె భర్త శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ పోలీసులు వెల్లడించారు.

మంచిని పెంచుదాం..


వీ.పీ.గౌతమ్

- ధరణిలో మిగిలిన పనులకు ప్రాధాన్యత
- కలెక్టర్ వీపీ గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మనలో ఉన్న మంచిని అందరికీ పంచి.. చెడును పక్కన పెడుతూ కొత్త సంవత్సరం కొత్త ఆశలతో ముందుకు సాగాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆకాంక్షించారు. దళితబంధు అమలు, ఖమ్మం–సూర్యాపేట రోడ్డు పనులు, ఖమ్మం–దేవరపల్లి నేషనల్ హైవే కోసం భూసేకరణ పూర్తి చేయడం ఈ ఏడాదిలో సంతృప్తినిచ్చిన పనులుగా పేర్కొన్నారు. ఇక ధరణి సమస్యలు చాలా వరకు క్లియర్ అయ్యాయని, మన ఊరు–మన బడి కార్యక్రమాలు 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కొత్త ఏడాది ఆ పనులను పూర్తి చేయనున్నట్లు వివరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలి..

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2022 ఏడాదిలో కరోనా ప్రభావం అంతగా లేదు. 2023లో కూడా అలాంటి ఇబ్బందులేవి లేకుండా మంచి జరగాలని భావిస్తున్నా. కొత్త ఏడాదిని ఎంజాయ్ చేస్తూనే బాధ్యతగా వ్యవహరించాలి. గత ఏడాది మేజర్‌గా సాధించిన విజయం దళితబంధుగా చెప్పొచ్చు. అందుకోసం జిల్లా అధికారులు చాలా కష్టపడ్డారు. రూ.400 కోట్ల విలువైన యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడం అనుకున్నంత సులువేమీ కాదు. ఎస్సీ కార్పొరేషన్ స్కీమ్ కింద రూ.30 కోట్ల పంపిణీకి మూడేళ్ల సమయం పడుతుంది. కానీ 4 వేల మంది లబ్ధిదారులకు దళితబంధు ఫలాలు అందజేయడం ఎంతో సంతృప్తినిచ్చిన అంశం. ఇక ఖమ్మం–దేవరపల్లి నేషనల్ హైవేకు దాదాపు 40 కి.మీ. మేర జిల్లాలో భూసేకరణ పూర్తి చేశాం. మూడేళ్లుగా దీన్ని చాలెంజ్‌గా తీసుకున్నాం. అలాగే ఖమ్మం–సూర్యాపేట రోడ్డు పూర్తి చేశాం. మరో పది రోజుల పనులు మిగిలి ఉన్నాయి.

కొత్త ఏడాదిలో ధరణి, మన ఊరు–మన బడి

ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి 2022లో అనేక సమస్యలను పరిష్కరించాం. కొత్త సంవత్సరంలో పాత సమస్యలు పరిష్కరించడాన్ని సవాల్‌గా తీసుకుంటాం. ఇంతకు ముందు 50 ఏళ్లుగా పాస్‌బుక్‌లు లేనివారు ఉన్నారు. వారికి ధరణి వెబ్‌సైట్‌తో పాస్‌బుక్‌లు వచ్చాయి. ఇక మన ఊరు–మన బడి 50 శాతం పూర్తి చేశాం. ఆరు నెలల కాలంలో రాష్ట్రంలోనే జిల్లాలో ఎక్కువ స్కూళ్లలో పనులు పూర్తి చేశాం. ఎవరు ముందుగా పనులు పూర్తి చేస్తే వారికే నిధులు విడుదల అవుతాయి. కొత్త కలెక్టరేట్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. త్వరలోనే అక్కడికి వెళ్తాం. అలాగే క్రీడలకు సంబంధించి స్టేడియాల నిర్మాణం జిల్లాలో పూర్తి చేస్తున్నాం. గోళ్లపాడు చానల్ పనులు పూర్తి కావొచ్చాయి.

సరి'కొత్త'గా అభివృద్ధి


ఆదర్శ్ సురభి

కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరం అన్ని రకాలుగా అభివృద్ధిలో పరుగులు పెడుతుండగా, ఈ ఏడాది ఆ సరికొత్త అభివృద్ధి పనులకు ప్రణాళికలు రచిస్తున్నామని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా కమిషనర్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పలు అంశాలను వెల్లడించారు. నగరంలో రెండు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మాణంలో ఉండగా, ఏసీపీ ఆఫీస్ పక్కన నిర్మించిన మార్కెట్ ప్రారంభానికి సిద్ధమవుతోందని తెలిపారు. బైపాస్ రోడ్డులో మరో మార్కెట్‌ను నిర్మించనున్నామని చెప్పారు. 60 డివిజన్లకు రూ.50 లక్షల చొప్పున కేటాయించి నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయిన్లు జనవరి నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇక గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పనులు చివరిదశకు చేరగా, మరో నాలుగు పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. అలాగే, ఇంటింటా చెత్త సేకరణను మరింత మెరుగుపరుస్తామని, పాత కార్పొరేషన్ కార్యాలయం, 60వ డివిజన్ రామన్నపేట, 30వ డివిజన్ రంగనాయకులగుట్టపై కొత్తగా బస్తీ దవాఖానాలతో పాటు టేకులపల్లి, ధంసలాపురం గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఎల్ఆర్ఎస్, సుడా నిధులతో లకారం చెరువుకు ఆనుకొని ఉన్న డ్రెయినేజీ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీగా మార్చాలనే ప్రణాళిక ఉందని కమిషనర్ వెల్లడించారు.

ప్రతీ గడపకు న్యాయసేవలే లక్ష్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు


డాక్టర్ టి.శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: ప్రతి గడపకు న్యాయసేవలు అందించడమే లక్ష్యమని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా లోక్ అదాలత్‌లు నిర్వహించి అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. 2022 ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో లోక్ అదాలత్‌ల ద్వారా పెండింగ్ కేసులను పరిష్కరించి రాష్ట్రస్థాయిలో ముందున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. చెడు వైపు వెళ్లకుండా.. సత్ప్రవర్తనతో సమాజంలో మన్ననలు పొందాలని, సమసమాజ స్థాపనలో యువత తన పాత్రను సమర్థవంతంగా పోషించాలని పిలుపునిచ్చారు.

ప్రజారక్షణే ధ్యేయంగా
ముందుకు సాగుతాం

పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్


విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: ప్రజా రక్షణే ధ్యేయంగా, వారి భద్రత కోసం పాటు పడుతూ ముందుకు సాగుతామని సీపీ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. నూతన సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కమిషనరేట్‌లో నేరాల నియంత్రణ కోసం సుమారు 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దుండగులు కమిషనరేట్‌లో అడుగు పెట్టడానికి భయపడేలా ఉక్కుపాదం మోపుతాం. రాత్రిళ్లు బీట్ల స్థాయిని పెంచి పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తాం. న్యాయం కోసం వచ్చే ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధమైంది. అదే విధంగా కమిషనరేట్‌లో ఈవ్ టీజింగ్, మహిళలకు వేధింపులు లేకుండా చేయటానికి షీటీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తాం. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా విస్తృత ప్రచారం చేస్తాం. ప్రజలు నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి. హ్యాపీ న్యూ ఇయర్.

విదేశాల్లో ఉన్నా స్వస్థలంపై మమకారం

క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్న మసూద్ పాషా


ఎండీ మసూద్ పాషా

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాలో క్రికెట్ క్రీడకు నూతనోత్తేజం వచ్చేలా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ఎండీ మసూద్ పాషా తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా టోర్నీలు నిర్వహిస్తూ ప్రతిభ కలిగిన క్రికెటర్లను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో జరుగుతున్న పువ్వాడ ప్రీమియర్ లీగ్ పోటీల సందర్భంగా హాజరైన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జెనీవాలో ఉద్యోగం చేస్తున్నా క్రికెట్‌పై ఆసక్తితో రెండు నెలలకోసారి ఖమ్మం వచ్చి క్రికెట్ అభివృద్ధిపై సమీక్షలు జరుపుతున్నట్లు తెలిపారు.

ఐదేళ్ల కిందటే నెట్లు ఏర్పాట్లు

క్రికెట్‌పై ఆసక్తి, జిల్లాలో క్రీడాకారులకు తనవంతు సహకరించాలనే భావనతో మసూద్‌పాషా ఐదేళ్ల కిందటే ఖమ్మంలో క్రికెట్ నెట్లు ఏర్పాటు చేశారు. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఆసక్తి ఉండడంతో ఆయన జిల్లా అసోసియేషన్ సహకారంతో అభివృద్ధికి చర్యలు చేపట్టారు. నియోజకవర్గాల వారీ టోర్నమెంట్లు నిర్వహిస్తుండగా, ఈసారి పువ్వాడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌తో ఆయనకు మెరుగైన అవకాశం దక్కింది. రాత్రివేళ సైతం మ్యాచ్‌లు నిర్వహించేందుకు గాను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్ అనుమతితో అసోసియేషన్ ద్వారా ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేశారు. ఆతర్వాత నిర్వహణకు మంత్రి, కలెక్టర్ నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో అసోసియేషన్ తొలిప్రయత్నం విజయవంతమైనట్లయింది. త్వరలోనే క్రికెటర్లను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు శిక్షణ కోసం కోచ్‌లను నియమించాలనే ఆలోచన ఉందని మసూద్ వివరించారు.

ఎస్సారెస్పీ కాల్వ గండి పూడ్చివేత


కాల్వ గండిని పూడ్చివేసిన దృశ్యం

తిరుమలాయపాలెం: ఖమ్మంరూరల్ మండలంలోని కొండాపురం సమీపాన ఎస్సారెస్పీ కాల్వకు పడిన గండిని పూడ్చివేశారు. కాల్వకు గండిపెట్టినట్లు సమాచారం అందడంతో పూడ్చివేసినట్లు ఇరిగేషన్ డీఈ బాణాల రమేశ్‌రెడ్డి తెలిపారు. గండి విషయమై రైతులు తమ దృష్టికి తీసుకురాగా పూడ్చివేశామని, ఎవరైనా గండి పెట్టేందుకు యత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, కాల్వ భూముల్లో ఆక్రమణకు పాల్పడినా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధుల 'నూతన' శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో నవీన ఆలోచనలతో జీవితంలో ముందడుగు వేయాలన్నారు. కొత్త సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు.

నేడు 'పొంగులేటి'కార్యాలయంలో వేడుకలు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సరం వేడుకలు నిర్వహిస్తున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

2.39 లక్షల మందికి రైతుబంధు జమ

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో శనివారం నాటికి 2,39,484 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.153.50 కోట్ల మేర యాసంగి రైతుబంధు నగదు జమ అయింది. ఇప్పటి వరకు మూడెకరాల లోపు భూమి కలిగిన రైతులకు నగదు అందిందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో 3,28,491 మంది రైతులను అర్హులుగా గుర్తించగా, ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.363.44 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇక కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 8,556 మంది రైతులు అన్నిపత్రాలతో జనవరి 6లోగా అధికారులకు దరఖాస్తు చేసుకుంటే రైతుబంధు జమ చేస్తారు.

సరైన దృక్పథంతో విజయం సాధ్యమే..


మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: ఏవ్యక్తికైనా సరైన దృక్పథం ఉంటే విజయం తప్పక వరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం సాయంత్రం ఆయన న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయమూర్తులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా తాను పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏడు నెలల్లో దాదాపు 1,500కుపైగా పాత కేసులను పరిష్కరించడమే కాక యాభై న్యాయ విజ్ఞాన సదస్సుల్లో పాల్గొని వివిధ వర్గాల వారిని చైతన్యపరిచినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో తాను పది సెలవులను వాడలేదని పేర్కొన్న ఆయన.. 11 సెలవులను వాడకుండా వదిలేసిన న్యాయశాఖ ఉద్యోగి మొగిలి వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు ఆర్.డేనీరూథ్, ఎస్.సంతోష్‌కుమార్, ఎస్.అమరావతి, మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, కె.ఆశారాణి, ఎస్.శాంతిసోని, పి.మౌనిక, జిల్లా కోర్టు ఏఓ సూర్యనారాయణ, ఉద్యోగులు రాధేశ్యాం, సింగం ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరురూరల్: ప్రతినెల వేతనం తీసుకుంటూ విధులకు మూడు నెలలుగా డుమ్మా కొడుతున్న ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడికి విద్యాశాఖ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కల్లూరు మండలం యజ్ఞనారాయణపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం లావుడ్యా రాంచందర్ మూడు నెలలుగా విధులకు హాజరు కాకుండా తనకు బదులు విద్యావలంటీర్‌ను నియమించాడు. ఈ విషయమై 'సాక్షి'లో శుక్రవారం 'గిదేంది సారూ' శీర్షికన కథనం ప్రచురితం కాగా, జిల్లా విద్యాశాఖాధికారి తీవ్రంగా పరిగణించారు. ఈ మేరకు హెచ్ఎంకు శనివారం షోకాజ్ నోటీసు జారీ చేయడమే కాక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కల్లూరు ఎంఈఓను ఆదేశించారు.

కిడ్నాప్, దాడి ఘటనలో 'అన్నం' సహా 8 మందిపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన గ్యాస్ స్టౌ మెకానిక్ ఓంప్రకాష్‌ను నగరంలోని అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావుతోపాటు ఎనిమిది మంది కిడ్నాప్ చేయడమేకాక దాడి చేసి గాయపరిచారని అందిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 29న మధ్యాహ్నం కారులో శ్రీనివాసరావుతో పాటు చంటి, పాషా, సరస్వతి, ఈశ్వరమ్మ, వంశీ, రామాచారి, యాకూబ్‌పాషా ఇంట్లో ఉన్న ఓంప్రకాశ్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి బైపాస్‌రోడ్డులోని అన్నం ఆశ్రమంలో బంధించి తీవ్రంగా కొట్టి గాయపరిచారు.

ఈ విషయమై ఓంప్రకాశ్ బంధువు వెళ్లి అడగగా తొలుత బుకాయించినా, ఆపై గాయాలతో ఉన్న ఆయనను ఆస్పత్రిలో చేర్చారు. తీవ్రంగా గాయపడిన ఓంప్రకాష్ ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌శాఖలో 16 మందికి పదోన్నతులు

ఖమ్మంవ్యవసాయం: మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసు పరిష్కారం కావడంతో విద్యుత్ శాఖలో 16 మందికి ఉద్యోగోన్నతి లభించింది. ఖమ్మం విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో 16 మందికి పదోన్నతి కల్పిస్తూ సర్కిల్ సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు ఖమ్మంలోని కార్యాలయంలో కౌన్సెలింగ్ జరగగా, ఉద్యోగులకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు పది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి దక్కగా, ఎస్.హరిత, వి.మహేశ్‌ను ఖమ్మం టౌన్ డివిజన్ ఆఫీస్‌కు, ఆర్.శ్రీనివాస్‌రావు, జి.శైలులను ఖమ్మం రూరల్ ఈఆర్‌ఓకు, ఎ.ఉషారాణిని ఖమ్మం సర్కిల్ ఆఫీస్ పెన్షన్ విభాగానికి, సీహెచ్ హరీశ్, ఎం.కనకదుర్గను ఖమ్మం రూరల్ డివిజన్ ఆఫీస్‌కు, పి.కృష్ణారావు, ఎం.శ్రీలతను ఈఆర్‌ఓ ఖమ్మంటౌన్–1కు, పి.భారతిని పీఏఎస్ ఖమ్మం సర్కిల్ కార్యాలయానికి కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ఉపేందర్‌కు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించగా ఖమ్మం సీఆర్ఎస్ ఎల్‌టీసీఓలో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ విభాగం సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ కేఎల్ఎన్ రాజుకు ఫోర్‌మెన్ గ్రేడ్–1గా పదోన్నతి కల్పించి సత్తుపల్లి ఏఈ ఆపరేషన్స్‌కు బదిలీ చేశారు. అలాగే, నలుగురు లైన్ ఇన్‌స్పెక్టర్లు కె.రాజశేఖర్, జి.వెంకటేశ్వర్లు, డి.ఉమామహేశ్వరరావు, బి.శేషగిరిరావుకు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది. కాగా, జిల్లాలోని మధిర, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నా కొత్తగా ఉద్యోగోన్నతి పొందిన వారికి అక్కడ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఎస్ఈ ఎ.సురేందర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు ఉద్యోగులకు పదోన్నతి కల్పించి, అవసరమైన ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

మనోహరం.. శ్రీకృష్ణావతారం

- వైభవోపేతంగా ఊంజల్‌సేవ
- నేడు తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం



శ్రీకృష్ణావతారంలో దర్శనమిస్తున్న రామయ్య



స్వామివారి తిరువీధి సేవ సందర్భంగా కోలాటం ఆడుతున్న భక్తులు

భద్రాచలం: ముగ్ధమనోహరమైన రూపం.. చూడచక్కని ఆకారం.. కిరీటంపై నెమలి ఈకలతో చెంతనే సీతామహాదేవి, పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతున్న శ్రీకృష్ణావతారంలో ఉన్న భద్రాద్రి రామయ్యకు భక్తులు నీరాజనం పలికారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రామాలయంలో జరుగుతున్న పగల్‌పత్తు వేడుకల్లో స్వామివారు శనివారం శ్రీకృష్ణావతారంలో దర్శనం ఇవ్వడంతో అవతారాలు ముగిశాయి. తొలుత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిట్టయ్యకు ఘనంగా ఊంజల్ సేవ

స్వామివారి అవతారాల్లో భాగంగా శ్రీ కృష్ణాలంకరణలో ఉన్న రామయ్యకు వైభవోపేతంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుడైన రామయ్యను ఊయలలో ఊపుతూ వేదమంత్రాలు పఠించారు. అనంతరం హారతి సమర్పించారు. డోలోత్సవంలో పాల్గొని స్వామివారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి అశ్వమేధయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం వస్తుందని, సర్వపాపాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని వేద పండితులు వివరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి వెన్న, అటుకులు, బెల్లం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామనామ స్మరణలతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తజనంతో పండుగ శోభ సంతరించుకుంది. అనంతరం కోలాటాలు, మేళ తాళాలు నడమ స్వామివారిని ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చి వేదికపై ఆశీనులు చేశారు. భక్తుల దర్శనార్థం తిరువీధి సేవ నిర్వహించారు. ఆస్థాన మండపంలో స్వామి వారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన ఇచ్చి పవళింపు సేవ జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

తెప్పోత్సవం రోజునే..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరగనుంది. రామాలయంలోని ఆస్థాన మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమంగై ఆళ్వార్ స్వామి వారి పాదాల చెంత పరమపదించి, అనంతరం స్వామివారి అనుగ్రహంతో జీవం పోసుకుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా తెప్పోత్సవం రోజు ఆలయంలో ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ.

నేటి కార్యక్రమాలిలా..

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సేవాకాలం, తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం
- మధ్యాహ్నం 1 నుంచి 2 వరకు రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతి సేవ, పగల్ పత్తు సమాప్తి
- మధ్యాహ్నం 3 గంటలకు దర్బారుసేవ
- సాయంత్రం 4 నుంచి 5 వరకు స్వామి వారిని ఊరేగింపుగా గోదావరి నది వద్దకు చేర్చుట
- సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు హంస వాహనంపై తెప్పోత్సవం

సత్కారంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ దంపతులు, తదితరులు





నృత్య ప్రదర్శనలో కలెక్టర్ గౌతమ్ సతీమణి గౌతమి

రామయ్య చెంతన 'గౌతమి' నృత్య పరవళ్లు

అలరించిన కలెక్టర్ సతీమణి నృత్యరూపకం

భద్రాచలంలో జరుగుతున్న ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా మిథిలా స్టేడియం వద్ద ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈమేరకు శనివారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సతీమణి గౌతమి ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. నృత్యగురువు మీనాకుమారి నేతృత్వాన బృందంతో కలిసి ఆమె సీతాకళ్యాణానికి కూచిపూడి నృత్యంతో దృశ్యరూపం కల్పించారు. ఇదిగో భద్రాద్రి.. అదిగో భద్రాద్రి చూడండి అంటూ సాగిన కీర్తనలకు గౌతమి ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అనంతరం గౌతమితో పాటు ఆమె గురువు, బృందాన్ని సత్కరించారు. కాగా, కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ గౌతమ్‌కు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. – భద్రాచలం

బొగ్గు ఉత్పత్తిలో ముందంజ



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో డిసెంబర్‌లో 14.01 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా, 13.67 లక్షల టన్నులు సాధించినట్లు ఏరియా జీఎం జక్కం రమేష్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీఎం వివరాలు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 మాసాల్లో 99.41 లక్షల టన్నుల లక్ష్యానికి 87.69 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసి 88 శాతం సాధించామని వివరించారు. రోడ్డు, రైలు మార్గం ద్వారా 14.31 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. పీవీకే–5షాఫ్ట్ గనిలో డిసెంబర్ నెలలో 41 వేల టన్నుల లక్ష్యానికి 22 వేల టన్నులు మాత్రమే సాధించి వెనుకంజలో ఉందని, గని 330 మీటర్ల లోతులో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల చిన్న, చిన్న ప్రమాదాలు జరిగాయని వివరించారు. వీకే–7షాఫ్ట్ గనికి వచ్చే ఫిబ్రవరిలో అనుమతులు వస్తాయని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు సంస్థ క్వార్టర్లను ఖాళీ చేయకపోతే పీనల్ రెంట్‌తో పాటు బెనిఫిట్స్ నిలిపివేస్తామని అన్నారు. అధికారులు వెంకటేశ్వరరావు, రమేష్, బూర రవీందర్, సూర్యనారాయణ, సామ్యేల్ సుధాకర్, శ్రీకాంత్, కిరణ్‌బాబు, రమణారెడ్డి, మురళి పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ముస్లిం, నూర్‌బాష్, దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ ఇంతియాజ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ముస్లిం మైనార్టీలకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ముస్లింలకు మైనార్టీ ఫైనాన్స్ ద్వారా రూ.50 కోట్లతో పాటు మరో రూ.70కోట్లు పెంచడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఇన్‌చార్జ్ షేక్ షకీనా, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దాసాహేబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ సుభాన్‌అలీ, గౌరవ అధ్యక్షుడు జానిభాయి, నాయకులు సహంగీర్, లతిఫ్,రజాక్, నాగూర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అదనపు కలెక్టర్‌కు వినతి

ఖమ్మం సహకారనగర్: అన్నం శ్రీనివాసరావు ఫౌండేషన్‌పై తక్షణమే విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. సీపీఐ నాయకులు మహ్మద్ సలాం, యానాలి సాంబశివారెడ్డి, ఎస్‌కె.సైదా, రమణ, చానా, ఎండీ రెహ్మాన్, కరీం, యాకుబ్, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువు మాధారంలో సూర్యాపేట–ఖమ్మం జిల్లాల స్థాయిలో గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. నూతన సంవత్సరం, సంకాంత్రి పండుగ సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో జట్లు పాల్గొని నువ్వా..నేనా అన్నట్లు తలపడుతున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు భారీగా సంఖ్యలో తరలివచ్చారు.



తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు





డీసీసీబీలో 'సహకార మిత్ర'

- డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ సౌకర్యం
- ఆర్థిక లావాదేవీల్లో రాష్ట్రంలోనే రెండో స్థానం
- వెల్లడించిన చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో కొత్తగా పరిమిత కాలంతో కూడిన 'సహకార మిత్ర' డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లు చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీలను అందించేలా సహకార మిత్ర డిపాజిట్ల సేకరణ మహోత్సవాన్ని 333 రోజుల పథకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద సాధారణ వ్యక్తులకు 7.50 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ అందుతుందని చెప్పారు. కాగా, ఖమ్మం డీసీసీబీ రూ.2,681.95 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. బ్యాంక్ డిపాజిట్లు రూ.1,013.78 కోట్లు, రుణాలు రూ.1,668.17 కోట్లుగా నమోదయ్యాయని చైర్మన్ తెలిపారు. మార్చిలో ముగియనున్న ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంక్ టర్నోవర్ రూ.3 వేల కోట్లను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

సాగుకు రూ.380 కోట్ల రుణాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.680 కోట్ల వ్యవసాయ రుణాలు, బంగారం రుణాలు రూ.359.89 కోట్లు ఇచ్చామని చైర్మన్ నాగభూషణం తెలిపారు. చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లే 209 మంది విద్యార్థులకు రూ.26 కోట్లు, 500 మందికి కర్షక మిత్ర మార్టిగేజ్ రుణాలు రూ.48 కోట్లు, చిన్న పరిశ్రమలకు పీఎంఈజీపీ కింద రూ.10 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.4 కోట్లు అందించామని చెప్పారు. కాగా, గృహ రుణం రూ.75 లక్షల వరకు, మార్టిగేజ్ రుణాలు రూ.40 లక్షల వరకు, మల్టీపర్పస్ రుణాలు రూ.30 లక్షల వరకు, వాహన మిత్ర రుణాలు రూ.25 లక్షల వరకు, కర్షక మిత్ర రుణాలు రూ.10 లక్షల వరకు, ఎస్ఎంఈ ఫైనాన్స్ రూ.5 లక్షల వరకు, తత్కాల్ ఓవర్ డ్రాఫ్ట్ రూ.50 వేల వరకు ఇస్తుందని తెలిపారు. కాగా, సహకార సంఘాల ఉద్యోగులకు మానవ వనరుల పాలసీని అమలు చేస్తుండడంతో ఉద్యోగ భద్రత ఉంటుందని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.నర్మద, జనరల్ మేనేజర్ పద్మావతి పాల్గొన్నారు.



సహకార మిత్ర బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ, జీఎం







'ముక్కోటి' ఏర్పాట్లు పూర్తి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముక్కోటికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భద్రాద్రి కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శనివారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోదావరిలోకి భక్తులు దిగకుండా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. తప్పిపోయిన భక్తుల సమాచారాన్ని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 08743–232444 కాల్‌సెంటర్‌కు వివరాలు అందజేయాలన్నారు. వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతోపాటు ఆరు ఉచిత సెక్టార్లు ఏర్పాటు చేశామని, ఒక్కో సెక్టార్ కు ముగ్గురు ప్రత్యేకాధికారులను నియమించామని వివరించారు. అధిక ధరలకు ఆహార పదార్థాలు విక్రయించకుండా పౌరసరఫరాల అధికారి, ఆర్డీఓ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హంసవాహన పటిష్టతపై ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్‌ను ఆదేశించారు. 1.25 లక్షల లడ్డూలు విక్రయాలకు సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు. లడ్డూలు విక్రయించేటప్పుడు చేతులకు గ్లౌజులు, హెడ్ మాస్కులు ధరించాలన్నారు. సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. 24 గంటలూ నిరంతర వైద్య సేవలు అందించేలా అత్యవసర చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని, వర్షాలలో నీరు ఎక్కువగా ఉన్నందున భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా పేల్చే క్రమంలో రక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌ఓకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ శివాజీ, విద్యుత్ ఎస్ఈ రమేష్, డీపీఓ రమాకాంత్, వైద్యాధికారి శిరీష, మత్స్యశాఖాధికారి వీరన్న, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకల్యాణి పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్







మహాప్రసాదం.. రామయ్య లడ్డూ

ముక్కోటి వేడుకలకు 2 లక్షల లడ్డూలు..

భద్రాచలం: అవతార పురుషుడు, లోకజగన్నాథుడిగా పిలవబడే శ్రీసీతారామచంద్రస్వామి వారిని భక్తులు దర్శించుకుని ప్రసాదాలను స్వీకరిస్తుంటారు. ప్రసాదాలను అమృతఫలంగా భావిస్తూ స్వీకరించిన వారికి సర్వ గ్రహ బాధలు తొలగిపోయి, ఆ రాముడే నిరంతరం సదా కాపాడుతూ ఉంటారని భక్తులు విశ్వసిస్తారు. అలాంటి మహాప్రసాదమైన రామయ్య లడ్డూలను ముక్కోటికి వచ్చే భక్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. సుమారు 2 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

భక్తులకు మక్కువ..

భగవంతునికి సమర్పించిన ప్రసాదాన్ని స్వీకరించటం వల్ల ఆ భగవంతుని అనుగ్రహం కల్గుతుందని, ఆ ప్రసాదాన్నే అమృతఫలంగా భక్తులకు అందచేస్తాడని పండితులు పేర్కొంటున్నారు. భగవంతునికి ఇష్టమైన తీపి పదార్థాలతోటే ప్రసాదాలను నైవేద్యాలుగా సమర్పిస్తుంటారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారికి ప్రధానంగా లడ్డూ, పులిహోర, చక్కెర పొంగళి, రవ్వకేసరిలను పెడుతుంటారు. అయితే వీటిలో చక్కెర పొంగళి, పులిహోర, రవ్వకేసరి అన్ని సమయాల్లో నిల్వ ఉండటం సాధ్యం కాదు. కాబట్టి ఆయా సమయాల్లో మాత్రమే వాటిని అందుబాటులో ఉంచుతారు. కానీ నిల్వ ఉండే లడ్డూలను మాత్రం భక్తుల కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుతారు. భక్తులు సైతం అధికంగా లడ్డూలనే స్వామి వారి ప్రసాదంగా భావించి కొనుగోళ్లు చేస్తుంటారు. స్వామి అనుగ్రహంతో వారికి నైవేద్యంగా పెట్టి భక్తులకు అందచేసే ప్రసాదాలను స్వీకరించటం వల్ల బుద్ధి, జ్ఞానం, సత్ప్రవర్తన కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో తయారు చేసే లడ్డూలకు చాలా ప్రత్యేకత ఉంది. తినటానికి చాలా రుచిగా ఉంటుంది. ఈ లడ్డూలను తయారుచేసే కార్మికులు సైతం చాలా నిష్టతో, పవిత్రంగా తయారు చేస్తుంటారు.



లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న సేవకులు





నూతన సంవత్సర శుభాకాంక్షలతో... ఉత్తమ విద్య, క్రమశిక్షణకు చిరునామా... మన విద్యాలయాలు

చదువుల గుమ్మం

- ఖమ్మం నగరంలో వెలిసిన విద్యాసంస్థలు
- ఇక్కడే చదువుకుని ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న విద్యార్థులు
- పరీక్షల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న వైనం

ఖమ్మంసహకారనగర్ : నగరం చదువుల గుమ్మంగా మారింది. విద్యలో రాణించాలనే తపన ఉన్న విద్యార్థులకు ఖమ్మం మంచి కేంద్రంగా చెప్పవచ్చు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఇక్కడే విద్యను పూర్తి చేసే వెసులుబాటు నగరంలో ఉంది. ప్రభుత్వ కళాశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నగరంలో అనేకం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఏడాది పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పరీక్షల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తూ నగర కీర్తిని ఇనుమడింపచేస్తున్నారు. ఒకటి నుంచి పది ర్యాంకులలోపు నగరానికి చెందిన విద్యార్థులు ఉంటుండటం గర్వకారణంగా విద్యావేత్తలు అభివర్ణిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి బలమైన పునాది కలిగిన విద్యాసంస్థలు ఉండటం విశేషం. ఎల్‌కేజీ నుంచి విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కలిగిస్తూ విద్యాబోధన చేస్తున్నారు. సులభమైన రీతిలో అర్థమయ్యేలా బోధన సాగుతుండటంతో విద్యార్థులకు అంతగా ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రతి రోజు పాఠాలను బోధించడంతపాటు రివిజన్ కూడా చేయించడంతో విద్యార్థులు పరీక్షల సమయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సులవుగా రాయగలుగుతున్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులపై కళాశాలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్యను అం దించేందుకు కృషి చేస్తున్నాయి. అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థులు టెన్త్, డిగ్రీలలో ర్యాంకుల పంట సాగిస్తున్నారు. ఇక్కడే చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఇప్పుడు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మంచి కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. విద్యార్థుల ఉన్నతిలో నగరంలోని ప్రైవేట్ కళాశాలల పాత్ర ఎంతో ఉంది. ఖమ్మంలో విద్యాసంస్థల్లో చదివితే జీవితంలో స్థిరపడవచ్చనే భావన ప్రతి ఒక్కరిలో నెలకొంది. దీంతో అనేక ప్రాంతాల నుంచి కేవలం పిల్లల చదువుల కోసమనే నగరంలో స్థిరపడిన వారు మనకు చాలా మంది కనిపిస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తమ పిల్లలకు మంచి చదువులు అందించాలనే ఆలోచనతో ఇక్కడే కిరాయికి ఇళ్లు తీసుకుని పిల్లలను పాఠశాలల్లో, కళాశాలల్లో చదివించుకుంటున్నారు. ఈ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మంచి చదువును అందించడంతోపాటు ఇతర రంగాల్లో కూడా రాణించేలా కృషి చేస్తున్నాయి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నాయి. ఇంటర్ కాలేజీ క్రీడాపోటీల్లో ప్రతి కళాశాల విద్యార్థులు పాల్గొంటూ రాణిస్తున్నారు. అలాగే సైన్స్‌ఫేర్, క్విజ్ వంటి వాటిల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు.

ఉత్తమ విద్యకు శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడంతోపాటు నూతన ఆవిష్కరణలకు ముఖద్వారంగా విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఖమ్మం గుమ్మానికి శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్ కేంద్రంగా ఉందని విద్యాసంస్థల ఫౌండర్ కొండా శ్రీధర్ రావు అన్నారు. అనుభవజ్ఞులు, నిష్టాతులైన ఉపాధ్యాయ బృందాన్ని సమకూర్చుకుని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ వారిలోని అంతర్గత, వ్యక్తిగత నైపుణ్యాలను వెలికి తీయడానికి పాఠ్య, సమపాఠ్య కార్య క్రమాలను మేళవించి బోధిస్తున్నామని తెలిపారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌ను ఆధునిక పద్ధతులలో బోధిస్తూ వ్యక్తిత్వ వికాసం, కమ్యూ నికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ శారీరక ధృఢత్వానికి చక్కటి ఆటలకు విశాలమైన మైదానాన్ని, సంగీతం కోసం మ్యూజిక్ జోన్‌ను, ఒత్తిడి తగ్గించి, ఏకాగ్రతను పెంచేందుకు యోగాను, అద్భుతమైన కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో జాతీయ ర్యాంకు లను, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రథమ బహుమతులు, ఇన్‌స్పైర్ అవార్డులను సాధించామని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనతో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.స్వప్న తెలిపారు. నర్సరీ నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్కూల్‌లో డ్యాన్స్, మ్యూజిక్ రూమ్స్, ఆర్ట్, క్రాఫ్ట్ రూమ్స్, అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ సదుపాయాలు ఉన్నట్లు వివరించారు. సహజ పద్ధతి, సీబీఎస్ఈ కరిక్యులమ్‌లో బోధన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వైఫై సౌకర్యం ఉంటుందని, జర్మనీ, స్పానిష్ లాంగ్వేజీలు నేర్పుతున్నట్లు తెలిపారు. మెడికల్, ఐఐటీ ఫౌండేషన్ ప్రోగ్రాంలో శిక్షణ ఉంటుందని, వీటితోపాటు వచ్చే ఏడాది నుంచి హార్స్ రైడింగ్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, స్కేటింగ్ రింక్, రన్నింగ్ ట్రాక్, రోబోటిక్స్, కోడింగ్ లలో ప్రత్యేక చిక్షణా క్లాసులు కూడా ఉటాయని తెలిపారు. క్వాలిఫైడ్, అనుభవం ఉన్న టీచర్లతో విద్యాబోధన, కంప్యూటర్, లాంగ్వేజ్ ల్యాబ్, 4 ఎకరాల సువిశాల పచ్చటి క్యాంపస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన సాగిస్తామని వివరించారు. చిన్నారుల్లో దాగి ఉండే సృజనాత్మకతను వెలికితీసే వేదికగా తమ విద్యాసంస్థలు వెలుగొందుతున్నాయని తెలిపారు. డిజిటల్ బోర్డులు, అత్యంత ఆధునిక ఏసీ క్లాస్‌రూమ్‌ల ద్వారా విద్యాబోధన తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో న్యూఇరా బోధన

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని మమత రోడ్డులో ఉన్న న్యూఇరా పాఠశాలలో ఆధునిక పద్ధతుల్లో స్టేట్, సీబీఎస్ఈల్లో విద్యాబోధన చేస్తున్నట్లు పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ అన్ని చోట్ల ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తోపాటు 6వ తరగతి నుంచి విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌తో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. 5వేల పుస్తకాలతో విశాలమైన లైబ్రరీ, రీడింగ్ స్థాయి పెంచేందుకు అధునాతన పద్ధతిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సీసీఈ పద్ధతికి అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లతో సైన్స్ ల్యాబ్స్, ప్రాజెక్ట్ వర్క్‌తో టీచింగ్, క్షేత్రస్థాయి పరిశీలనకు ఏటా క్రమం తప్పకుండా స్టడీటూర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విధంగా మ్యూజిక్, డ్యాన్స్, చెస్, యోగా, కరాటే, ఆర్ట్ మరియు క్రాఫ్ట్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అధునాతన వసతులతో బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించినట్లు చెప్పారు. ఆటపాటలకు విశాలమైన ప్లేగ్రౌండ్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని రకాల వసతులతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అధునాతన బిల్డింగ్, విశాలమైన క్లాస్ రూములు, విద్యార్థుల ప్రత్యేక క్లాసులు మరియు అనుభవం కలిగిన సీనియర్ అధ్యాపకులచే విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది 10వ తరగతి పరీక్షలలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి... మన విద్యాలయాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు - 2023

చరిత్ర తిరగరాస్తున్న హార్వెస్ట్ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో చరిత్రను తిరగరాస్తున్నారని సెక్రటరీ, కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి పేర్కొన్నారు. హార్వెస్ట్ విద్యా సంస్థలు నర్సరీ నుండి 12 వ తరగతి వరకు విద్యార్థులను తీర్చి దిద్దుతాయని తెలిపారు. హార్వెస్ట్ బోధనా పద్ధతి విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదునుపెట్టి వారి ఆలోచనాశక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రతిరోజు కో కరిక్యులార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పీరియడ్స్ పిల్లల పఠనాశక్తిని పెంచుతాయని వివరించారు. జేఈఈ ,నీట్ వంటి జాతీయ పరీక్షలకు కాన్సెప్ట్ క్లారిటీ, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రెండు కంప్యూటర్ లాబ్స్ ,ఫిజిక్స్ ,కెమిస్ట్రీ ,బయాలజీ లాబ్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతమూడు సంవత్సరాలుగా 15శాతం మంది విద్యార్థులు ఐఐటీ,ఎన్ఐటీలలో చేరుతున్నారని, 17 శాతం విద్యార్థులు మొదటి ప్రయత్నం లోనే మెడిసిన్ లో చేరుతున్నారు. విద్యార్థి విద్యా మంథన్‌లో రాష్ట్ర స్థాయికి 12 మంది విద్యార్థులు ఎంపికైనా, చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలో ప్రధమ స్థానం పొందినా ,వివిధ క్రీడలు,సాంస్కృతిక పోటీలలో రాష్ట్ర,జాతీయ పతకాలు సాధించినా అది హార్వెస్ట్ శిక్షణా సామర్థ్యానికి నిదర్శనం అన్నారు.

వైద్య విద్యకు రాచమార్గం భవిష్య మెడికల్ అకాడమి

ఖమ్మంసహకారనగర్: వైద్య విద్యలో ప్రవేశం కోసం విద్యార్థులకు రాచమార్గంగా భవిష్య మెడికల్ అకాడమి ఉపయోగపడుతుందని అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ బి.రామిరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.భాస్కరరావు తెలిపారు. నగరంలోని గట్టయ్యసెంటర్ లో ఉన్న నూతన కార్పొరేషన్ కార్యాలయానికి ఎదురుగా ఈ అకాడమి ఉందని, ఇక్కడ డే అండ్ రెసిడెన్షియల్ అవకాశం ఉందని పేర్కొన్నారు. దాదాపు 25 ఏళ్లకు పైగా కార్పొరేట్ కళాశాలల్లో బోధించిన అనుభవం ఉన్న విజయవాడ అధ్యాపకులు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ సీటు సాధనే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సెక్షన్‌కు 35 మందికి విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు వివరించారు. నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు నీట్ శిక్షణ కోసం సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఖమ్మంలోనే నీట్ అకాడమిని స్థాపించినట్లు తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని చెప్పారు.
దూర ప్రాంత విద్యార్థులకు క్వాలిటీ మెనుతో చక్కని ఇంటి వాతావరణాన్ని మైమరిపించే హాస్టల్ సదుపాయం.

విజ్ఞానాన్ని పెంచే విద్య నిర్మల్ హృదయ్ ప్రత్యేకత

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా విద్యాబోధన చేయడం నిర్మల్ హృదయ్ హైస్కూల్ ప్రత్యేకత అని ఫౌండర్ చైర్మన్ వంగా సాంబశివరెడ్డి, ప్రిన్సిపల్ వంగా పద్మ తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు. యువతలో సృజనాత్మక, యాక్టివ్ ఆలోచనా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతిగదులు, విద్యార్థులు ఉల్లాసంగా ఆడుకునేందుకు వీలుగా ప్లేగ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్, రవాణ సౌకర్యం ఉన్నట్లు వివరించారు.

వికాస్ లో వ్యక్తిగత శ్రద్ధతో బోధన

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని వీడీవోస్ కాలనీలో ఉన్న వికాస్ స్కూల్‌లో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధన చేస్తామని స్కూల్ ప్రిన్సిపాల్ వై.లావణ్య అన్నారు. గతంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనుభవంతో వికాస్ స్కూల్ ప్రారంభించినట్లు తెలిపారు. నైపుణ్యం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, సిబ్బందితో విద్యాబోధన చేస్తున్నామని, ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నతనంనుంచే సాంకేతిక విద్యపై అభిరుచి కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. థీమ్ కాన్సెప్ట్‌తో బోధన చేపడుతున్నట్లు తెలిపారు.

ఏ విద్యార్థితోనైనా విశిష్ట ఫలితం బ్లోసమ్స్ ప్రత్యేకత

ఖమ్మంసహకారనగర్ : విద్యార్థి ఏ స్థాయిలో ఉన్నా విశిష్ట ఫలితాలను సాధించడమే బ్లోసమ్స్ ప్రత్యేకత అని ఆ స్కూల్ కరస్పాండెంట్ నలజాల రుక్మిణి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను తమ స్కూల్ సాధించినట్లు వివరించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కరోనా తర్వాత విద్యార్థులు విద్యపై తక్కువ శ్రద్ధ కలిగి ఉన్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని తమ పాఠశాలలో ప్లే-వే మెథడ్‌లో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. మల్టీమీడియా, ఆచరాణాత్మకమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పదో తరగతిలో 10 జీపీఏ పాయింట్లు, 100 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు.

విద్యతోపాటు ఆట పాటల యందు గూగుల్‌కిడ్స్ ముందంజ

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని గూగుల్ కిడ్స్ ప్రైమరీలో విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో ముందుకుపోతున్నదని స్కూల్ కరస్పాండెంట్ అనుమోలు కృష్ణప్రసాద్, డైరెక్టర్ ఆర్. శ్రీనివాస గుప్తా పేర్కొన్నారు. ఈ స్కూల్‌లో నూతన విద్యా ప్రమాణాలు, అనుభవజ్ఞులైన టీచర్లతో విద్యాబోధన, తరగతి గదిలో పరిమిత సంఖ్యలో విద్యార్థులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి తరగతిలోసీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు స్కూల్‌లో డ్యాన్స్, కరాటే, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌ను విద్యార్థులతో ఆడిస్తున్నట్లు తెలిపారు.

విజయికేతనం ఎగురవేస్తున్న తెలంగాణ నారాయణ

ఖమ్మంసహకారనగర్ : ప్రతి ఏడాది పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేస్తున్నారని స్కూల్ డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్, కొదుమూరు నాగపవన్ తెలిపారు. సీనియర్ ఫ్యాకల్టీతో అత్యుత్తమ బోధన పద్ధతులతో విద్యార్థులకు బోధిస్తున్నట్లు చెప్పారు. నీట్‌లో ఎనిమిది మంది, జేఎన్‌టీయూలో ఆరుగురు, ఎన్ఐటీలో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొ న్నారు. 2019లో ఐఐటీ రామయ్యలో 10 మంది, 2018లో 10మంది ఎంపికయ్యారని వివరించారు. 2019 లో 70శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులకు తొమ్మిది పాయింట్లకు పైగా జీపీఏ సాధించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి లిటిల్ ఫ్లవర్ పట్టుకొమ్మ

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు లిటిల్ ఫ్లవర్ స్కూల్, కళాశాలలు పట్టుకొమ్మల్లా ఉపయోగపడుతున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబు తెలిపారు. ఏజన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేషమైన విద్యను తమ విద్యా సంస్థలు అందిస్తున్నాయని పేర్కొ న్నారు. ఫౌండర్ మాగంటి సూర్యం అందించిన స్ఫూర్తితో విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించి స్కూల్, కళాశాల్లో అత్యుత్తమ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

20వ రోజు 1,184మంది హాజరు

ఖమ్మంక్రైం : పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా చేపట్టిన దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం 1,348మంది అభ్యర్థులకు గాను 1184మంది ఈవెంట్లకు హాజరయ్యారని సీపీ విష్ణు ఎస్. వారియర్ వెల్లడించారు. ఇందులో 696మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించారని తెలిపారు. కాగా, అభ్యర్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా బయో టాయిలెట్ల వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆయకట్టు రైతులకు ఇబ్బంది రానివ్వం



కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీటికి ఇబ్బంది పడకుండా చూస్తామని ఇరిగేషన్ నోడల్ అధికారి మంగలపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని బీబీసీ, మేజర్, మైనర్ కాల్వలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. బీబీసీ కాల్వకు 1,250 క్యూసెక్కులకు తగ్గకుండా నీరు అందించడం ద్వారా చివరి భూముల వరకు నీరందుతుందని తెలిపారు. ఈ విషయమై ప్రతిరోజు పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఎస్ఈ ఆనంద్‌కుమార్, డీఈలు శ్రీనివాసరావు, రాంప్రసాద్, నాగబ్రహ్మయ్య, డీఈ సంతోష్‌తో పాటు రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, నాయకులు కాకాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఉపాధ్యాయుడు

కలెక్టర్ ఆదేశాలతో విచారణ..సస్పెన్షన్

కూసుమంచి: ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు రెవెన్యూ పరిధి కేశ్వాపురంలో సుమారు ఆరెకరాల ప్రభుత్వ భూమి ఉండగా, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు గత గురువారం కలెక్టర్ వీపీ గౌతమ్ ఇక్కడి భూములను పరిశీలించారు. అయితే, సర్వే నంబర్ 474లోని ప్రభుత్వ భూమిలో 3.10 ఎకరాలను పక్కనే భూమి కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నల్లమల ప్రభాకర్‌రావు, ఆయన సోదరులు ఆక్రమించినట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీంతో ఎంఈఓ బీవీ రామాచారితో విచారణ జరిపించగా ఆక్రమణ నిజమేనని తేలడంతో, ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభాకర్‌రావును సస్పెండ్ చేస్తూ శనివారం డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన ప్రభాకర్‌రావు గట్టుసింగారంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

కల్లూరు: పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని తిరువూరు మండలం రాజుపేటకు చెందిన ఎస్.కే.ఇమ్రాన్(25) కల్లూరు వచ్చి శనివారం రాత్రి తిరువూరు వైపు స్కూటీపై బయలుదేరాడు. ఈక్రమంలో ఆయనను గుర్తుతెలియని వాహనం ఢీకొని తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇమ్రాన్‌కు రెండేళ్ల క్రితం వివాహం కాగా భార్య, ఓ కుమారుడు ఉన్నాడు. ఎస్సై బి.కొండలరావు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

నూతన విద్యావిధానంతో నష్టమే..



వేదికపై అభివాదం చేస్తున్న బి.వెంకట్, తమ్మినేని వీరభద్రం, జి.నాగయ్య తదితరులు

- వ్యకాస రాష్ట్ర మహాసభల్లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- ముగిసిన మహాసభలు



మహాసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంతో అందరికీ విద్య అందక నష్టం జరుగుతుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఖమ్మం వేదగిరి శ్రీనివాసరావునగర్‌లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. ఒకటి, రెండు గదుల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతోపాటు బాలింతలు, గర్భిణులకు ఆహారం అందించడం, వంట చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ రంగంలో కొనసాగుతున్న పూర్వప్రాథమిక విద్యను చట్టబద్ధం చేసి కార్పొరేట్లకు అప్పగించే యత్నంలో భాగంగానే నూతన విద్యావిధానం వచ్చిందని తెలిపారు. కాగా, పాఠ్యపుస్తకాల్లో చరిత్రను వక్రీకరించి రాయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా మెరుగైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో వ్యవసాయ కార్మిక సంఘం కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, బస్తీ దవాఖానాల పేరుతో హడావిడి చేయడం మానేసి ప్రతి పీహెచ్‌సీలో ముగ్గురు డాక్టర్లను పెట్టి 24 గంటలూ పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

ముగిసిన వ్యకాస మహాసభలు

ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఖమ్మంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలు శనివారం ముగిశాయి. తొలిరోజు భారీ బహిరంగ సభతో పాటు 30, 31వ తేదీల్లో ప్రతినిధుల సభలు నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా 450 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు వ్యవసాయ కార్మిక సంఘం భవిష్యత్ కార్యాచరణ, పోరాటాలు, కర్తవ్యాలపై ప్రతినిధులు చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. బహిరంగ సభలో కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించగా.. ఖమ్మం కేంద్రంగా జరిగిన ఈ మహాసభలు వ్యవసాయ కార్మిక సంఘంలో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

దేశ ఆహార భద్రతను దెబ్బతీసే కుట్ర

- కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు
- ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గల్ఫ్ దేశాలకు ఆయిల్‌పై ఆధిపత్యం ఉన్నట్లు ఆసియా దేశాలకు ఆహార ధాన్యాలపై ఆధిపత్యం ఉందని.. ఈ క్రమంలో వరి ఎక్కువగా పండే భారతదేశంలో ఆహార భద్రతను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభల్లో భాగంగా శనివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకొస్తుండటమే కాక ఎఫ్‌సీఐని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టేలా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 5 వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు దశల్లో ఈ క్యాంపెయిన్ ఉంటుందని, పాదయాత్ర ద్వారా ప్రజల ఇళ్లకు వెళ్లి కలుస్తామని చెప్పారు. కాగా, భూనిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వడమే కాక అదేతీరున వ్యవసాయ కార్మికులకూ అందించాలని, రైతుబంధు తరహాలో కూలీబంధు ఇవ్వాలని వెంకట్ డిమాండ్ చేశారు.

కన్నపేగును వద్దనుకుని..

- పెద్దాస్పత్రిలో శిశువును వదిలేసిన తల్లిదండ్రులు
- గుర్తించి, కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు



ఊయలలో శిశువు



శిశువును అధికారులకు అప్పగిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: కన్నప్రేమను తెంచుకునేందుకు నిర్ణయించుకున్నారు ఆ తల్లిదండ్రులు.. కనికరం లేకుండా బిడ్డను వదిలించుకోవాలని చూశారు. ఆడపిల్లను సాకలేమనే సాకుతో ఐదు రోజుల బిడ్డను పెద్దాస్పత్రిలోని ఊయలలో వేసివెళ్లిపోయారు. పిల్లలు వద్దనుకునే వారు చెత్తకుప్పల్లో వదిలి వెళ్తున్న నేపథ్యాన అధికారులు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఊయల ఏర్పాటు చేశారు. అందులో శనివారం మధ్యాహ్నం 12–30 గంటలకు శిశువును వేసి వెళ్లగా సిబ్బంది ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన పరీక్షించి శిశువు జ్వరం, కామెర్లతో బాధపడుతుండడంతో ఎస్ఎన్‌సీయూలో చేర్చి చికిత్స అందించారు. ఆతర్వాత సంక్షేమాధికారి సంధ్యారాణి, శిశు సంరక్షణ అధికారి విష్ణువందన చేరుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు

సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా గుర్తింపు

ఆస్పత్రి, సంక్షేమ శాఖాధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు శిశువు తల్లిదండ్రులను గుర్తించేందుకు యత్నించారు. ఈమేరకు ఆస్పత్రిలోని సీసీ కెమెరాల పుటేజీ, ఆస్పత్రి కేస్‌షీట్లు పరిశీలించి సూర్యాపేట జిల్లా గోపాతండాకు చెందిన దంపతులు తమ శిశువును వదిలివెళ్లినట్లు గుర్తించారు. ఈమేరకు వారిని విచారించగా ఐదు రోజుల కిందట ఆస్పత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చిన మహిళకు అప్పగికే ఆడ శిశువు ఉండడంతో ఇద్దరినీ సాకలేమని భావించి ఊయలలో వేసి వెళ్లినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారికి ఐసీడీఎస్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. చివరికి వారు శిశువును తీసుకెళ్లిందుకు అంగీకరించగా సూర్యాపేట చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షాన అప్పగించాలని నిర్ణయించారు.

3 నుంచి హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె



ఐటీడీఏ పీఓకు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాల అనుబంధ హాస్టళ్లలోని డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మాచారి, హీరాలాల్ తెలిపారు. శనివారం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి సీఐటీయూ ఆధ్వర్యాన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. వేతనాల విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నకిరికంటి నాగరాజు, సంద్ర భూపేందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగపరంగా వ్యవహరించాలి..

ఖమ్మంమయూరిసెంటర్: పురాణ కథను విమర్శించినందుకు గాను నాస్తికవాది బైరి నరేశ్‌ను అరెస్ట్ చేయడం గర్హనీయమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛను హరించే చర్యగా భావిస్తున్నామని, ఎవరైనా సరే రాజ్యాంగపరంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ మతోన్మాదులు, మనువాదులకు లొంగిపోయిందని ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆరోపించారు.



పెద్దాస్పత్రిలోని క్యాథల్యాబ్ మిషన్

మెడికల్ హబ్‌గా ఖమ్మం !



జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు

- వైద్యసేవల కోసం పక్క జిల్లాల నుంచి తాకిడి
- జిల్లా ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి సేవలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ఈ ఏడాది మెడికల్ హబ్‌గా తయారైంది. కార్పొరేట్ స్థాయి ప్రైవేట్ ఆస్పత్రులు నెలకొల్పగా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోనూ అధునాతనమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలతో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. జిల్లా ఆస్పత్రిలో సాధారణ వైద్య సేవలే కాక కార్డియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ సేవలు అందుబాటులోకి రావడం విశేషం. దీనికి తోడు మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు ఎక్కువగా చేస్తుండటంతో సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఏపీ సరిహద్దు గ్రామాల నుంచి వైద్య సేవల కోసం వస్తున్నారు.

కనుమరుగైన 104 సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలు అందించిన 104 వ్యవస్థకు ప్రభుత్వం మంగళం పలికింది. క్షేత్రస్థాయిలో పల్లెదవాఖానా ద్వారా వైద్య సేవలు అందిస్తుండటంతో వాహనాలను వేలం వేయాలని నిర్ణయించగా సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 వాహనాల్లోని సిబ్బందిని వివిధ ప్రాంతాల్లో సర్దుబాటు చేశారు.

అందుబాటులోకి తల్లిపాల సేకరణ కేంద్రం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ఏడాది రూ.40 లక్షల వ్యయంతో తల్లిపాల సేకరణ కేంద్రం అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ తర్వాత ఖమ్మం పెద్దాస్పత్రిలోనే ఈ కేంద్రాన్ని ప్రారంభించడం విశేషం. తల్లుల నుంచి సేకరించే పాలను ఇక్కడ ఆరు నెలల నుంచి ఏడాది పాటు భద్రపరిచే వీలుంది.

గుండె రోగులకు ఆధునిక వైద్యం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన క్యాథలాబ్‌ను జనవరి 28న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించడంతో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇబ్బందులు తప్పాయి. ఇప్పటి వరకు సుమారు 350 మందికి శస్త్రచికిత్సలు అందించారు.

అందుబాటులోకి టిఫా మిషన్స్

ఇటీవల ఆస్పత్రికి రూ.27 లక్షల చొప్పున విలువైన రెండు టిఫా మిషన్లు కేటాయించారు. వాటి ద్వారా 28 నుంచి 26 వారాల గర్భిణులకుల స్కానింగ్ చేస్తే పిండం ఎదుగుదలను గుర్తించే అవకాశం వచ్చింది. ఖర్చుతో కూడుకున్న ఈ స్కానింగ్ కోసం ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సిన బాధ తప్పింది.

మూడో వేవ్‌తో ఇబ్బందులు

2022 ప్రారంభంలో కరోనా మూడోవేవ్‌తో ప్రజలు ఇబ్బంది పడ్డారు. జనవరి నుంచి కేసుల సంఖ్య పెరగగా, రెండు నెలల పాటు వేల సంఖ్యలో కేసులు వెలుగు చూశాయి. మూడో వేవ్‌లో జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మందికి పరీక్షలు నిర్వహించగా 18,359 మంది కరోనా బారిన పడ్డారు. అధికారికంగా 52 మంది మరణించారు. వ్యాక్సినేషన్ కూడా భారీగానే జరిగింది. 18 ఏళ్ల నిండిన వారికి రెండు డోసులు నూరు శాతం, టీనేజర్లకు రెండు డోసులు పూర్తి చేశారు. అయితే బూస్టర్ డోస్ మాత్రం ఇప్పటివరకు జిల్లాలో 45 శాతం మంది మాత్రమే వేసుకున్నారు.



బస్తీ దవాఖానా

పల్లె, పట్టణ దవాఖానాలతో మెరుగు పడిన వైద్య సేవలు

జిల్లాలో ప్రభుత్వ వైద్యం మరింత బలోపేతం చేశారు. జిల్లా వ్యాప్తంగా 247 సబ్ సెంటర్లు ఉండగా వాటిలో ఆస్పత్రులకు సుదూరంగా ఉండే 104 సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. అలాగే, తొమ్మిది బస్తీ దవాఖానాలు ఏర్పాటయ్యాయి. పల్లె దవాఖానాలో వైద్యులను నియమించి మెరుగైన సేవలు అందిస్తున్నారు. అలాగే బస్తీ దవాఖానాల్లో పోస్టులు భర్తీ చేశారు.



క్యాథల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొత్తగా మెడికల్ కళాశాల



మెడికల్ కళాశాల కోసం సర్వే నిర్వహిస్తున్న అధికారులు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా 2022మార్చిలో ప్రభుత్వం మెడికల్ కళాశాల మంజూరు చేసింది. కళాశాలకు కావాల్సిన భవనాలు, నిర్మాణ స్థలాలపై సర్వే చేశారు. పెద్దాస్పత్రితో పాటు పాత కలెక్టర్ భవనం, ఆర్అండ్‌బీ కార్యాలయ భవనం, ఖాళీ స్థలాలను సర్వే నిర్వహించి 30 ఎకరాల మేర స్థలం అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. 2023లో ఇక్కడ 150 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి, బోధన ప్రారంభించనున్నారు.

■ ఘనస్వాగతం !


కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచే ఇళ్ల ముందు ముగ్గులు వేసి రంగులద్దారు. అలాగే, చిన్నాపెద్ద తేడా లేకుండా కాలనీలు, అపార్ట్‌మెంట్లలో పాటలు పెట్టుకుని నృత్యాలతో సందడి చేశారు. ఇక కేక్‌లు కట్ చేయడమే పరస్పరం కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



సత్తుపల్లిలో అర్ధరాత్రి 12గంటలకు కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ రాము తదితరులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేసిన ముగ్గు

10వ తేదీలోగా మన ఊరు–మన బడి పనులు

- రాష్ట్రంలో 9,123 పాఠశాలల ఎంపిక
- పనుల్లో భద్రాద్రి జిల్లాకు మూడోస్థానం
- టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి



ఇల్లెందు రూరల్ : అధికారులకు సూచనలు చేస్తున్న రావుల శ్రీధర్‌రెడ్డి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీ మండలంలో ఎంపిక చేసిన రెండు పాఠశాలల్లో మన ఊరు - మన బడి పనులను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్(టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. భద్రాద్రి జిల్లాకు శనివారం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో మన ఊరు- మన బడి పనులపై విద్య, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా మన ఊరు–మన బడి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రంలో మొదటి విడతగా 9,123 పాఠశాలలను ఎంపిక చేయగా, దాదాపు రూ.9 వేల కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. జనవరి 7లోగా ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్న అన్ని పనులు గ్రౌండింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ఇక జిల్లా పనుల పురోగతిలో రాష్ట్రస్థాయిలోనే మూడో స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 368 పాఠశాలల్లో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు కృషి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం మన ఊరు - మన బడి పథకం ద్వారా కృషి చేస్తోందని టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇల్లెందు మండలం సంజయ్‌నగర్, పట్టణంలోని స్టేషన్‌బస్తీ ప్రాథమికోన్నత, ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఆయన పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కనీసం పక్షం రోజులకోసారైనా పాఠశాలను శుభ్రం చేసేలా స్థానిక సంస్థల సహకారం తీసుకుంటూ, మరిన్ని సౌకర్యాల కల్పనకు దాతల చేయూత కోరాలని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, ఈఈ సురేష్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన

ఖమ్మం మామిళ్లగూడెం: కరోనా కష్టకాలం రెండేళ్ల తర్వాత ఖమ్మం ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు శనివారం విశేష స్పందన లభించింది. డీఎం చాంబర్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో 15 మంది కాలర్స్ ఖమ్మం డీఎం శ్రీనివాసరావుతో మాట్లాడారు. సిటీ లోకల్ బస్సులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ రూట్‌లో నడపాలని కోరారు. మరికొందరు ఇల్లెందు, చింతకాని, సూర్యాపేట, బోనకల్ రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని కోరారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న పారుపల్లి నాగేశ్వరరావు

రఘునాథపాలెం: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేసి విద్యారంగంలో సంక్షోభాన్ని నివారించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం బి.సక్రాం అధ్యక్షతన జరిగిన రఘునాథపాలెం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, కోశాధికారి ఎస్.శేషగిరిరావు పాల్గొన్నారు.

నివాళి..

నేలకొండపల్లి: మండల కేంద్రంకు చెందిన ఆర్యవైశ్య సంఘం నేత మేళ్లచెరువు రంగారావు (80) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రంగారావు మృతదేహాన్నిసందర్శించి నివాళులర్పించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు 'హార్వెస్ట్' విద్యార్థిని



మొక్క రిషిత

ఖమ్మంస్పోర్ట్స్: ఢిల్లీలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు జరిగే 44వ సబ్ జూనియర్ నేషనల్స్‌కు రాష్ట్ర జట్టులో హార్వెస్ట్ పాఠశాలకు చెందిన మొక్క రిషిత స్థానం లభించింది. ఆమె డిసెంబర్‌లో 23 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొనగా జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డిలు అభినందనలు తెలిపారు.

ఫొటోగ్రఫీ పోటీల్లో బంగారు పతకం



అవార్డు అందుకుంటున్న జగన్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఫొటో ఆర్ట్స్ ఆర్గనైజేషన్(కేపీఏఓ) ఆధ్వర్యాన నాలుగు రోజుల పాటు ఏపీలోని అరకులో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో ఖమ్మంకు చెందిన గుణగంటి జగన్ బంగారు పతకం గెలుచుకున్నారు. ఇటీవల జరిగిన పోటీల్లో ఆయన ఆర్టిస్టిక్ పోర్ట్రేచర్ విభాగంలో తీసిన ఫొటోకు పతకం దక్కింది. తెలంగాణ, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీల సెక్రటరీలు విశ్వేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రముఖ కవయిత్రి రావులపాటి సునీత, కేపీఏఓ అధ్యక్ష, కార్యదర్శులు చింతల నాగేశ్వరరావు, సెక్రటరీ వి.నాగరాజుదేవర చేతుల మీదుగా జగన్ బహుమతి స్వీకరించగా, పలువురు అభినందించారు.

11న సంతాప సభ

తిరుమలాయపాలెం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు సంతాప సభను జనవరి 11న నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని తెట్టెలపాడులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు శివలింగం, డివిజన్ కార్యదర్శి సీవై పుల్లయ్య, మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నవీన్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, సరోజిని పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	అవతార్–2
వినోద	ఖుషి
సాయిరాం	అవతార్–2
ఆదిత్య	18 పేజెస్
శ్రీనివాస	ధమాకా
సుందర్	నువ్వే నా ప్రాణం

– ఖమ్మంవ్యవసాయం

న్యూ.. జోష్!

మొదలైన న్యూ ఇయర్ సందడి
- జోరుగా కేక్‌లు, స్వీట్ల విక్రయాలు
- ముందస్తు ఆర్డర్లతో బేకరీలు బిజీబిజీ
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వైనం
- రంగులు, ముగ్గులు, అలంకరణ వస్తువుల వైపు మహిళల మొగ్గు





ఖమ్మంలోని ఓ బేకరీలో విక్రయిస్తున్న స్వీట్లు (ఇన్‌సెట్) కేక్‌లు అమ్ముతున్న దృశ్యం

న్యూ ఇయర్ అంటేనే ఓ కొత్త రకమైన క్రేజ్.. యువతీ, యువకులు, బంధువులు, స్నేహితులు నూతన సంవత్సర హంగామా చేశారు. పాత సంవత్సరానికి గుడ్ బై చెబుతూ.. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కేక్‌లు కట్ చేయటం, స్వీట్లు పంచుకోవటంతో పాటు విందులు కూడా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో బేకరీలు, స్వీట్, రంగులు, హోటళ్లు, రెస్టారెంట్లు వంటి దుకాణాల్లో కొనుగోలుదారులతో విక్రయాలు ఊపందుకుని రద్దీ నెలకొంది. ఇళ్ల లోగిళ్లలో ముగ్గులతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు మహిళల సందడి కూడా మరో ప్రత్యేకంగా నిలిచింది.

ఖమ్మంగాంధీచౌక్: కొత్త సంవత్సరం అనగానే పిల్లలు, విద్యార్థులు, యువత, పెద్దలు కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరాలు జరుపుకోవటం ఆనవాయితీ. ఈ వేడుకలకు ప్రాధాన్యం పెరగటంతో స్వీట్ షాపులు, బేకరీలు, రెస్టారెంట్లు కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కేకులు, స్వీట్లు, ఆహారపదార్థాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. అంతేకాక పేరున్న బేకరీలు న్యూ ఇయర్ సంబరాలను దృష్టిలో ఉంచుకొని పెద్దఎత్తున కేక్‌లను తయారు చేసి విక్రయిస్తున్నాయి.

జోరుగా విక్రయాలు..
ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వీట్లు, కేక్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఖమ్మం నగరంలో పేరున్న బేకరీల్లో సెమీ ఫాండెంట్, బార్బీ, టాయిస్ కేక్, స్టెప్ కేక్, మిక్కీ మౌస్, స్క్వేర్ ఏక్ తదితరాలను తయారు చేసి విక్రయాలను ప్రారంభించారు. పేరున్న బేకరీల్లో సైజు, రకాన్ని బట్టి కేజీ రూ. 400 నుంచి అమ్ముతుండగా.. మరికొన్ని బేకరీల్లో రూ. 250 నుంచి ఆపైన ధరలతో కేక్‌లను విక్రయిస్తున్నారు. ప్రధాన రహదార్ల వెంట, వీధుల్లో టెంట్లు వేసుకొని డీజేలు పెట్టి కొత్త పాటలతో హంగామా చేస్తూ కేక్‌లను అమ్ముతున్నా రు. ఇక స్వీట్ దుకాణాల్లో అయితే రకరకాల స్వీట్ల ను నూతన సంవత్సర స్పెషల్‌గా విక్రయిస్తున్నారు.



రంగుల అమ్మకాలు ఇలా..

ఆఫర్లతో ఆహ్వానం..
బేకరీలు, రహదారుల వెంట కేక్‌లకు కూల్ డ్రింక్స్‌ను ఆఫర్లుగా పెట్టారు. కేజీ కేక్ కొనుగోలు చేస్తే ఒక కూల్ డ్రింక్ బాటిల్ ఉచితంగా ఇస్తున్నారు. రూ.280 నుంచి రూ. 300ల విలువ చేసే కేక్ కొనుగోలు చేస్తే రూ.60 నుంచి రూ.70ల విలువ చేసే కూల్‌డ్రింక్‌ను ఉచితంగా ఇస్తుంటే కొన్ని బేకరీలు, స్వీట్ దుకాణాలు తక్కువ ధరలకు ఆఫర్లుగా పెట్టి అమ్ముతున్నారు. అంతేకాక ఒక్కో బిర్యానీకి ఒక లీటర్ కూల్ డ్రింక్ ఆఫర్ కూడా ఇస్తుండడంతో యువతీ యువకులు, విద్యార్థులు ఆఫర్ల వైపే మొగ్గు చూపుతున్నారు.

ముగ్గులు, అలంకరణ వస్తువుల విక్రయాలు..
కొత్త సంవత్సరం కొంగొత్తగా ఉండాలని ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేయటం కోసం మగువలు మార్కెట్‌లో రంగురంగుల ముగ్గులు విక్రయిస్తున్నారు. ముగ్గుల్లో చమ్కీలు కలిపినవి కూడా విక్రయిస్తున్నారు. అంతేకాక ఇళ్లు కొత్తగా కనిపించేలా అలంకరించేందుకు కర్టెన్లు, ఫ్లవర్ వాజ్‌లు వంటి వాటిని విక్రయిస్తున్నారు. అంతేకాక మహిళలు తమ అలంకరణలకు అవసరమైన గాజులు కూడా కొనుగోలు చేస్తున్నారు.

ఆనందంగా జరుపుకున్నాం..



నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకుంటున్నాం. ఇంటిలో కుటుంబంతో పాటు స్నేహితులతో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకునేందుకు స్వీట్లు, కేక్‌లను కొనుగోలు చేశాం. కొత్త సంవత్సరం నాడు ఆనందంగా గడుపుతాం.

– కొండల్‌రావు, ఆటోనగర్, వరంగల్ క్రాస్ రోడ్, ఖమ్మం

పండగలా చేసుకుంటాం..



నూతన సంవత్సర సంబరాలను ఓ పండుగలా జరుపుకుంటున్నాం. స్వీట్లు, కేక్‌లు కొనుగోలు చేశాం. కరోనా కారణంగా రెండేళ్లకు పైగా నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నాం. ఈ ఏడు ఆ ఇబ్బందులు లేకపోవటంతో కొంగొత్తగా జరుపుకుంటున్నాం.

– గణేష్‌కుమార్, సింహాద్రినగర్, ఖమ్మం

ఆటపాటలతో సందడి చేస్తాం..



స్నేహితులమంతా కలిసి న్యూ ఇయర్ వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నాం. కేక్‌లతో పాటు ఆఫర్లుగా ఉన్న కూల్ డ్రింక్స్‌ను కూడా తీసుకున్నాం. స్నేహితులమంతా కలిసికట్టుగా ఆటపాటలతో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ వేడుకలను జరుపుకుంటాం.

– అన్వర్, గట్టయ్యసెంటర్, ఖమ్మం

కేక్‌లకు గిరాకీ ఉంది..



కేజీ, అర కేజీ కేక్‌లకు గిరాకీ బాగుంది. కేజీ ఒక్కంటిని రూ. 220 చొప్పున, అర కేజీని రూ. 120 చొప్పున విక్రయిస్తున్నాం. యువతీ, యువకులు, విద్యార్థులు, కుటుంబాల వారు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన ఆర్డర్ల ప్రకారం కేక్‌లను తయారు చేయించి విక్రయిస్తున్నాం.

– దుంగ్రోత్ నాగన్ నాయక్, విక్రయదారుడు, జహీర్‌పుర, ఖమ్మం

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, 2023 క్యాలెండర్లను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ ఆవిష్కరించారు. నగరంలోని ఎన్నెస్పీకాలనీలోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంఘం ఉపాధ్యాయులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకర్‌రావు, నాయకులు కె.వెంకటేశ్వరరావు, కె.నర్సింహరావు, భాస్కర్, రామ్మూర్తి, శ్రీమన్నారాయణ, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్..
తిరుమలాయపాలెం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం(టీఎస్‌యూటీఎఫ్) క్యాలెండర్‌ను జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, మండల నోడల్ అధికారి జ్యోతి శనివారం తిరుమలాయపాలెం ఎంఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కేశ్యా, సతీష్, ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో కేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బానోత్ కీమా, వైస్ చైర్మన్ రాంబాబు ఆధ్వర్యంలో ముద్రించిన భగవద్గీత పుస్తకాలను డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి ప్రవర్తనకు భగవద్గీత దోహదపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రామోజీ, పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కూసుమంచి: మండల పరిధిలోని చిన్నపోచారం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా పశువైద్య శిబిరాన్ని ఆత్మా కమిటీ పాలేరు డివిజన్ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువులు, కోళ్లకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామసహాయం శశికళ, మండల పశువైద్యాధికారి నీలకాంత్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు..



కూసుమంచి: పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి/ రఘునాథపాలెం/నేలకొండపల్లి: రాష్ట్రంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నోటిఫికేషన్లో జరుగుతున్న అవకతవకతలపై యువజన కాంగ్రెస్ పిలుపులో భాగంగా శనివారం తలపెట్టిన చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లకుండా మండల కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులను ఆయా మండలాల్లో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ తీరును నిరసించారు. రాత్రి వరకు ఉంచి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. నేలకొండపల్లికి చెందిన ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ముట్టడి కార్యక్రమంలో పాల్గొనగా.. ప్రగతి భవన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కూసుమంచి నుంచి నాయకులు కనకం మైసయ్య, ఎండీ కలీమ్, శ్రీనివాస్, కిరణ్, భిక్షంనాయక్, రవినాయక్, రఘునాథపాలెం నుంచి మండల యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కోటేష్‌నాయక్, బానోతు మోహన్, సుధాకర్‌నాయక్, రమేష్‌నాయక్ కుమార్, దేవ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న సన్నె ఉదయ్‌ప్రతాప్

ఖమ్మం మామిళ్లగూడెం: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ అధ్యక్షతన జరిగిన జిల్లా దళితమోర్చా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందు దేవతమూర్తుల మీద బైరు నరేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మండలాల వారిగా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ సమావేశంలో దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతమళ్ల వీరస్వామి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శులు నాగరాజు, ఉపేందర్, కోటేశ్వరావు, చిన్నికృష్ణ, వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రావు, డి.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకర్ సెంటర్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని వైద్యులు కేక్ కట్ చేసి చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపి మాట్లాడుతూ.. కరోనా సమయంలో సంజీవినిలా ఎన్జీవోస్ పని చేశాయని, ఆరోగ్యశ్రీ లేని చిన్నారులకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ మేనేజర్ శ్రీనివాస్, వైద్యులు డి.నారాయణమూర్తి, భార్గవ్, మెట్రో ఆప్టికల్స్ యజమాని అప్పారావు, సంకల్ప సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్, ఉపాధ్యక్షురాలు పావని, పి.ఉదయ్ భాస్కర్, అనిత, వంశీ కిరీటి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాపాడాలి

ఖమ్మంరూరల్: భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన పౌరహక్కులను కాపాడడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ టి. సుమా అన్నారు. శనివారం మండలంలోని తెల్దారుపల్లిలో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ ఎస్.కోటయ్య, ఎంపీటీసీ, టి.మంగతాయారు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు, ర్యాలీలు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మం అర్బన్/కూసుమంచి/ మామిళ్లగూడెం : హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా అయ్యప్పస్వామిపై బైరి నరేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని పలు సంఘాల బాధ్యులు తీవ్రంగా ఖండించాయి. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ, ,వివిధ అయ్యప్ప సంఘాలు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని రోటరీనగర్, ఇందిరానగర్‌లో నిరసన ర్యాలీ తీసి అనంతరం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో అయ్యప్ప సొసైటీ సభ్యులు, హిందూ సంఘాల ప్రతినిధులు ఎస్సై రమేష్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా అయ్యప్పస్వామి అఖిల భారత ప్రచారసమితి అధ్యక్షుడు రాంప్రసాద్ ,గురుస్వామి కార్యదర్శి నెల్లూరి కోటేశ్వరావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములతో వివిధ హిందూ సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించి, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్ని కులాలను, మతాలను గౌరవించే తెలంగాణలో విషబీజాలు నాటుతున్న ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు, జిల్లా కార్యదర్శులు చిర్రా రవి, పుట్ట మల్లిఖార్జున్, ధూప దీప నైవేద్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరింగంటి భార్గవాచార్యులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్ రాథోడ్, నున్న రవికుమార్, రుద్రప్రదీప్, పట్టణ అధ్యక్షులు మస్తాన్ రావు గురుస్వామి, గొల్లపూడి హరికృష్ణ, తోటకూరి శివయ్య, నాయకులు అన్నావఝ్జుల ప్రసాద్ శర్మ, సురేష్ శర్మ, ఉమేష్, రాధాకృష్ణశాస్త్రి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



ఖమ్మంఅర్బన్: నిరసన ర్యాలీ తీస్తున్న పలు సంఘాల బాధ్యులు, నాయకులుఖ

చెక్కుల పంపిణీ

కూసుమంచి: కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, డిప్యూటీ తహసీల్దారు అన్సారీ, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన యలమద్ది నాగమణికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేసింది. శనివారం 25వ డివిజన్‌లో జిల్లా అధ్యక్షుడు కమర్తపు మురళి ఆధ్వర్యాన ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్తి శ్రీనివాసబాబు, జనార్దన్, బండారు శ్రీను, కొండల్‌రావు, వీరభద్రం, సునిత, శివ,నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు..



మద్దులపల్లిలో ఆర్థికసాయమందిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల, వెంకటగిరి, మద్దులపల్లి, తెల్దారుపల్లి, పొన్నేకల్, తల్లంపాడులలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ శనివారం ఆర్థిక సాయం అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందించి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు,నాయకులు భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, సైదులు, పేరం వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం : మండలంలోని బాధ్యతండాకు చెందిన భూక్యా సూక్కి ఇటీవల మృతి చెందగా శనివారం పువ్వాడ ఫౌండేషన్ ద్వారా మంత్రి పువ్వాడ వ్యక్తిగత కార్యదర్శి రవికిరణ్ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూ నాయక్‌తో పాటు నాయకులు రామ్మూర్తినాయక్, దేవా, రవి, రమేష్, లక్‌పతి, వీరన్న, జగన్, బాలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు..

ఖమ్మంమయూరిసెంటర్: నూతన సంవత్సర సందర్భంగా 46వ డివిజన్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ నోట్ పుస్తకాలు, స్టేషనరీని వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపుమేరకు ఈ వితరణ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్దె నాగేశ్వరరావు, గోధుమల శ్రీనివాసరావు, శనిగరం ఉప్పలయ్య, కాటం యాదయ్య, కాల్వొడ్డు శ్రీను, వేముల విజయ్, బచ్చ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులపై విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న యర్రా శ్రీకాంత్

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టులను విమర్శించేస్థాయి బీజేపీకి, ఆ పార్టీ నేతలకు లేదని సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె. జానిమియా అన్నారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ మాట్లాడగా.. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జానిమియా మాట్లాడారు. కమ్యూనిస్టులు నిష్పక్షపాతంగా, నిస్వార్థంగా రాజకీయాలు చేస్తారని, అలాంటి కమ్యూనిస్టులపై నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. రాష్ట్రాల్లో అధికారం కోసం ప్రభుత్వాలను పడగొట్టి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తుందని, దేశంలో కులాల మధ్య గొడవలు పెట్టడం, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ నాయకులు చూస్తున్నారన్నారు. పేదల హక్కుల కోసం, కార్మికుల సమస్యలపై పోరాడుతున్నందునే వారంతా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలకు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చారన్నారు. కేరళలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సీపీఎం కార్యకర్తలను ఉచకోత కోస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై చేసిన విమర్శలను తిప్పికొట్టారు. కమ్యూనిస్టులపై విమర్శలు మానుకోవాలని లేని పక్షంలో తగు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నూతన' సంబరాలు..

నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని శనివారం విద్యాలయాలను రంగవల్లులతో అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. అనంతరం ఆయా పాఠశాలల యజమాన్యాలు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఈ నూతన సంవత్సరంలో విద్యార్థులకు అంతా శుభం కలగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా నగరంలోని ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో మేయర్ చాంబర్‌లో మేయర్ నీరజ సిబ్బందితో కలిసి వేడుకలు జరుపుకుని ఖమ్మం నగర పాలక సంస్థ 2023 క్యాలెండర్లను ఆవిష్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: సర్వజ్ఞ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ



ఖమ్మం సహకారనగర్: శ్రీనగర్ రెజొనెన్స్‌లో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి



ఖమ్మంఅర్బన్: రంగువల్లితో సందడి చేస్తున్న విద్యార్థినులు



త్రివేణి పాఠశాలలో కేక్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్



ఖమ్మంఅర్బన్: బొమ్మ కాలేజీలో..



స్మార్ట్‌కిడ్జ్‌లో కరస్పాండెంట్ కృష్ణచైతన్య



ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్



కూసుమంచి: గ్లోబల్-రెయిన్‌బో పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయురాలు

ఉపాధి కల్పిస్తున్న.. నవ సమాజ నిర్మాతలు

ఖమ్మంగాంధీచౌక్ : సమాజంలో పేదరికం.. నిరుద్యోగం పెరిగిపోతోంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారికి ఉపాధి కరువవుతోంది. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఇలా దిక్కుతోచని స్థితిలో ఉండే యువత కొందరైతే. ఎన్నో కలలతో సొంతంగా వ్యాపార సంస్థను నిర్వహించాలనే కోరికతో ఉండే ఔత్సాహికులు కొందరు. నిరుద్యోగులు ఉపాధి లేక ఎలా నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారో..? వ్యాపారం నిర్వహించాలనే తపన ఉన్న ఔత్సాహికులు కూడా పెట్టుబడి, నిర్వహణ తదితర వాటిపై మల్లగుల్లాలు పడుతుంటారు. వ్యాపారంలో భాగస్వామ్యం ఉంటే ఒక ఇబ్బంది.. లేకపోతే ఒక ఇబ్బందిలా ఉంటుంది. ఇలాంటి బాధలన్నింటినీ తట్టుకుని ఒక వ్యాపార సంస్థను నెలకొల్పి.. దానిలో రాణించడం చిన్న విషయం కాదు. ఎందరో దిగ్గజాలు దెబ్బతిన్న సందర్భాలున్నాయి. వ్యాపారం ఏదైనా వ్యవస్థను నడపడం అంటే కేవలం లాభార్జన మాత్రమే కాదని కొందరు వ్యాపారులు నిరూపిస్తుంటారు. వారు అటు వ్యాపారం చేయడంతో పాటు మానవీయ కోణాన్ని కూడా స్పృశిస్తుంటారు. వీరు న్యాయమైన వ్యాపారంతో వినియోగదారులకు ఆత్మీయులుగా మారడంతోపాటు సాటివారికి సాయం అందించే సుగుణం కలిగి ఉంటారు. తమ వద్ద పనిచేసే వారిని కూడా సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటుంటారు. నిరుద్యోగం పెరిగి పోతున్న ప్రస్తుతం సమాజంలో ఇటువంటి నిఖార్సైన వ్యాపారుల అవసరం ఇటు సమాజానికి కూడా ఎంతో ఉంది. కుటుంబ పోషణ చేయడానికి నానా తిప్పలు పడుతున్న నిరుద్యోగులకు ఈ వ్యాపారులు మార్గనిర్దేశకులు అవుతున్నారు. పరస్పర సహకారంతో వారి వ్యాపారాభివృద్ధితోపాటు.. తమ వద్ద పనిచేస్తున్న వారికి జీవనోపాధి కల్పిస్తూ ముందుకు పోతుంటారు. వ్యాపారం అంటేనే లాభాల వేట.. అటువంటి సమయంలో కూడా తమ వద్ద ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ.. వారితో ఇష్టంగా పని చేయించుకుంటున్న వ్యాపారులు ఎందరో. అటువంటి వారిలో కొందరే వీరే... వారి మాటల్లోని ఉపాధిని కల్పించడంలో ఉన్న ఫీలింగ్ ఎలా ఎంటుందో ఈ నూతన సంవత్సరం రోజున వారి మాటల్లోనే తెలుసుకుందాం.



మనం బ్రతుకుతూ.. పది మందికి ఉపాధిని కల్పించడం మనసుకు నిజమైన ఆనందాన్ని ఇస్తుంది. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలి.
– చెరుకూరి కృష్ణమూర్తి, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్



మనం చేసే వ్యాపారంలో ఉద్యోగులదే కీలక భూమిక. పది మందికి ఉపాధి కల్పించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.
– మర్రిపుడి రాంబాబు, ఎండీ, రంగరాయ టీవీఎస్, వైరా రోడ్డు, ఖమ్మం.



మనం చేస్తున్న వ్యాపారంతో పది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవడంలో ఎంతో సంతృప్తిగా ఉన్నది.
– పారుపల్లి వీరభద్ర రావు, కృష్ణ అండ్ హవేలి గ్రూప్స్ అధినేత, బైపాస్‌రోడ్డు, ఖమ్మం.



మనం బ్రతకుతూ మనతో పాటు పది మందికి ఉపాధి ఇవ్వడం దేవుడు ఇచ్చిన వరం మరియు అదృష్టంగా భావిస్తున్నాను.
– పారుపల్లి రాము కృష్ణ అండ్ హవేలి గ్రూప్స్ అధినేత, వైరా రోడ్డు, ఖమ్మం.



ఉద్యోగం చేస్తే నేను ఒక్కడినే ఉపాధి పొందుతా.. అదే వ్యాపారం చేస్తే పది మందికి ఉపాధి కల్పించిన వాడిని అవుతాను. ఇదే ఫార్ములా నాకు సంతృప్తినిస్తుంది.
– వద్దెం విజయ్, శ్రీ విజయ్ గ్రానైట్ ఇండస్ట్రీస్ అధినేత, ముదిగొండ.



వేల మంది విద్యార్థులకు విద్యనందిస్తూ, నిరుద్యోగులకు ఉపాధినిస్తూ, వారిని మా కుటుంబ సభ్యులలో ఒకరిగా భావించడం మాకు ఎంతో సంతృప్తినిస్తుంది.
– రవి మారుత్ హార్వెస్ట్ విద్యాసంస్థలు, ఖమ్మం.



మన ద్వారా పది మంది ఉపాధి పొంది బ్రతుకుతుంటే కలిగే ఆనందంకన్నా మరేది ఉండదు.
– సీహెచ్ కిషోర్ సీతా మోటర్స్ ప్రొప్రైటర్, మమత రోడ్డు, ఖమ్మం.



మనం చేసే పనిలో సమాజ హితం ఉంటే మానసిక తృప్తినిస్తుంది.
– ధనాల పేరయ్య, శ్రీ హర్ష కన్వెన్షన్, వెంకటగిరి క్రాస్ రోడ్డు, ఖమ్మం.



పది మంది పేద కుటుంబాలకు ఉపాధి ఇవ్వడం పూర్వ జన్మలో మనం చేసుకున్న పుణ్యం.
– మోర్ల సత్యనారాయణ, ప్రొప్రైటర్, హోటల్ భవాని గ్రాండ్, వీడీవోస్ కాలనీ, ఖమ్మం.



మనం ఉపాధి పొందుతూ మరో పది మంది నిరుద్యోగులకు ఉపాదినివ్వడం సమాజసేవలో భాగమే.
– నాగసేతు మాదవన్, చైర్మన్, ది కే స్ట్రీట్, శ్రీశ్రీశ్రీ సర్కిల్, వైరా రోడ్డు, ఖమ్మం.



పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు పది మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది.
– డా॥ కావ్యచంద్ యాలముడి సిఇఓ, కావ్య హాస్పిటల్, ఖమ్మం.



మా విద్యా సంస్థల ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం మాకు సంతోషంగా ఉన్నది.
– కాటిరెడ్డి నాగమణి చైర్‌పర్సన్, కెయల్ఆర్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, పాల్వంచ



మన వ్యాపారాభివృద్ధికి అనునిత్యం అండగా ఉంటేది ఉద్యోగులే. వారికి ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా ఉన్నది.
– కొమ్మినేని నర్సింహారావు పావని పెయింట్స్, ఖమ్మం.



వైద్య విద్యతో మంచి వైద్యాన్ని అందిస్తూ నలుగురికి ఉపాధి కల్పిస్తున్నందుకు గర్వంగా ఉంది.
– డాక్టర్ కెసోజు భరత్‌బాబు, ఎండీ, ప్రశాంతి హాస్పిటల్, నెహ్రూనగర్, ఖమ్మం.



విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ, సమాజంలో ఉన్న నిరుద్యోగ సమస్యకు మా ద్వారా కొంత పరిష్కారం చూపిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.
– కొండా శ్రీధర్ రావు రెజోనెన్స్ విద్యాసంస్థలు, ఖమ్మం.